క్లుప్తంగా

ఇంటిపన్ను చెల్లించాలి



చారకొండ: ప్రతి ఒక్కరు ఇంటి పన్ను చెల్లించి, గ్రామ అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మి అన్నారు. సోమవారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధిత ఇంటిపన్నులను వసూలు చేపట్టారు. ఈనెల చివరి నాటికి గ్రామంలో ప్రతి ఇంటికి, ప్రతి దుకాణదారుడు తప్పనిసరి పన్నులు చెల్లించి రశీదు పొందాలని కోరారు. వారి వెంట కారోబార్ అశోక్ తదితరులు ఉన్నారు.

రేపు శివపార్వతుల కల్యాణ మహోత్సవం

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో ఈనెల 6న శివ పార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికృపాకటాక్షం పొందాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ



తాడూరు: మండలంలోని తుమ్మలసూర్, తాడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు నిరేష్‌బాబు జన్మదినం సందర్భంగా సోమవారం క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్ మాట్లాడుతూ త్వరలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షకు అవసరమయ్యే సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనీల్‌రెడ్డి, క్లాస్‌మెట్ క్లబ్ సభ్యులు వెంకటేష్, నిరంజన్, సత్యం, సురేందర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్లురవికే టికెట్ ఇవ్వాలి

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపీ మల్లురవికి అవకాశం ఇవ్వాలని ఎల్లికల్ మాజీ ఎంపీటీసీ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ పరిధిలో మల్లురవికి మంచి పేరు ఉందని పేర్కొన్నారు. ఆయనకు టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయని వివరించారు. అధిష్టానం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీ



వెల్దండ: చిన్నారుల నిండు ప్రాణాలకు రెండు చుక్కల పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ స్వరూప పేర్కొన్నారు. సోమవారం ఇంటింట సర్వే చేసి పోలియో చుక్కల మందులను పంపిణీ చేశారు. మండలంలోని 6482 చిన్నారులకు గాను 5051మందికి పోలియో చుక్కలను వేయినట్లు డాక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు



పెద్దకొత్తపల్లి: పెద్దకార్పాముల రైతు వేదికలో సోమవారం కౌలు రైతులకు వ్యవసాయ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రిలీగల్ క్లీనిక్ ప్యారలీగల్ వలంటర్ శ్రీనివాసులు కౌలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, కేతేపల్లి ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఏపీఓ కుర్మయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి



కొరటికల్‌లో శివస్వాముల ఇరుముడి



అచ్చంపేటలో శివస్వాములకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ సేవగుణం అలవర్చుకోవాలని సేవతోనే సంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయ ఆవరణలో పద్మశాలి మహిళ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం, ఫలదానం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పదకొండు సంవత్సరాలుగా శివ స్వాములకు అన్నదానం చేస్తున్న పద్మశాలి మహిళా సంఘం సభ్యులను అభినందించారు. భక్తిభావంతో ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి శకుంతల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కర్నాటి నిర్మల, చిలువేరు శ్రావణి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట కిశోర్, ధన్‌రాజ్, గుర్రం హైమావతి, దాసుపత్రి శకుంతల, వనం గీత, వర్కాల బాలకిష్టమ్మ, దాసు జంగమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయం వద్ద శివస్వాములు, ఎంపీటీసీ రేణుక నాగరాజులు సోమవారం అన్నదానం చేశారు. స్వాములు రవి, వెంకటేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఇరుముడి

ఉప్పునుంతల: మండలంలోని కొరటికల్‌లో సోమవారం శివమాలధారులు ఇరుముడి కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. శివమాల ధరించిన 13 మంది స్వాములకు గురుస్వాములు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగించిన ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనంతరం పాదయాత్ర శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు. కార్యక్రమంలో శివస్వాములు గణేష్ స్వామి, వెంకటేష్ స్వామి, రమేష్ స్వామి, రవి స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో శివమాలధారులు సోమవారం ఇరుముడి కట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



లక్ష్మాపూర్‌లో ఇసుకను దంపు చేసి టిప్పర్లకు లోడ్ చేస్తున్న జేసీబీ

ఉప్పునుంతల: ప్రభుత్వ పనుల అనుమతుల పేరిట మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గతంలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తే ప్రస్తుతం యథేచ్ఛగా యంత్రాలను వాగులోకి దించి ఇసుకను తరలిస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లకు, టిప్పర్లకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. కొందరు అక్రమార్కులు ఇదే అదునుగా భావించి అనుమతులు లేకున్నా ఇష్టానుసారంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. మార్చి నెలాఖరు ప్రభుత్వ నుంచి సీసీ రోడ్ల కోసం మంజూరైన నిధులు ల్యాప్స్ అవుతాయనే సాకుతో అధికారులపై ఒత్తిడి చేసి ఇసుక అనుమతులు పొందుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్లతో వాగు పరిసర ప్రాంతంలో ఉన్న మొల్గర, పెద్దాపూర్, లక్ష్మాపూర్ గ్రామాల్లో డంపులు చేసి ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. టిప్పర్లకు నింపి దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు నాగర్‌కర్నూల్, తెల్కపల్లి, అచ్చంపేట ప్రాంతాలకు ఇసుక తరలించి విక్రయిస్తున్నారు. గత పదిహేను రోజులుగా ఇసుక అక్రమ రవాణా మితిమీరి పోయింది. ఎక్కడ చూసినా ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు దర్శనమిస్తున్నాయి. మొల్గర సమీపంలోని దుందుబీ వాగులో ఇసుక ట్రాక్టర్ల సందడి నెలకొంది. గతంలో ప్రభుత్వ పనులకు అనుమతులు ఇచ్చినా వాగులో కూలీలు మాత్రమే ఇసుకను నింపేవారు. ఇప్పుడు ఏకంగా యంత్రాలతో వాగును తోడేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోకపోతే దుందుబీ వాగు మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉందని ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ శ్రీకాంత్‌ను వివరణ కోరగా సీసీ రోడ్లు, ఇతర ప్రభుత్వ పనుల కోసం ఈనెల 4వ తేదీ వరకు ఇసుక సేకరణ కోసం ట్రాక్టర్లు, రెండు టిప్పర్లకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ పనుల వద్దకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఇసుకను విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందాయి. ఇకనుంచి పరిమితంగా ఇసుక అనుమతులు ఇస్తామని తహసీల్దార్ తెలిపారు.

బీజేపీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేద్దాం



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: రాబోయె పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని ఎవరైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థిగా పార్థివ్ భరత్‌ప్రసాద్‌ను అధిష్టానం ప్రకటించిందని ఆయన విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. దేశం కోసం మోడీ, మోడీ కోసం మనం అనే నినాదంతో సమావేశంలో రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, బండెల రామచంద్రారెడ్డి, నర్సింహ, రాఘవేందర్‌గౌడ్, రవిగౌడ్, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, చందు, సురేందర్‌గౌడ్ తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం



బందోనిపల్లిలో టీకాలను వేస్తున్న డాక్టర్ శ్యామ్‌సుందర్



కోడేరులో

వెల్దండ: పశుసంపదను కాపాడుకుందామని పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బండోనిపల్లి, గుండాల, చొక్కన్నపల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి రోగ నివారణ టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఫణిందర్‌రెడ్డి, శ్రీను, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్ ఉన్నారు.

కోడేరు: మండల కేంద్రంలోని పశువులకు గాలికుంటు నివారణ టీకాలను సోమవారం డాక్టర్ భానుకిరణ్ పంపిణీ చేశారు. పశువులకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 31 వరకు టీకాలు వేస్తామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైపాల్ నానమ్మ సోమవారం మృతిచెందింది. ఈ సందర్భంగా అచ్చంపేట్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఊర్కొండ: మండలంలోని బొమ్మరాశిపల్లికి చెందిన కాటమోని కృష్ణయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించి సోమవారం రూ.80 వేలు అందజేశారు. అలాగే గ్రామ భవానీ యూత్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందించారు.

కల్వకుర్తి: పట్టణంలోని జేఎల్‌బీ రోడ్డులో శివాలయం ఎదుట నివాసం ఉన్న ఆశావర్కర్ ప్రశాంతి కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు సోమవారం బాధితురాలికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ



తెలకపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాండునాయక్ కేవీపీఎస్ 2024 డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలు, కులవివక్ష, అంటరానితనం లాంటి వాటికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయులను మరిచపోవద్దన్నారు. మహనీయుల స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్, కొంగరి కాశన్న, తిరుపతయ్య, బాల్‌చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి పీడీ ఉద్యోగం

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి చెందిన బోదాసు శ్రీను 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వెలువడిన గురుకుల ఫలితాల్లో పీడీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కార్యదర్శిని అభినందించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



పర్వతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువులతో విద్యార్థులు

తాడూరు: మండలంలోని పర్వతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వ్యవహరించారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓగా వేణుగోపాల్, హెచ్‌ఎంగా అంజి, 8 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెనచర్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యాశాఖమంత్రిగా హేమంతు, కలెక్టర్‌గా భక్తప్రహ్లాద, కలెక్టర్‌గా కౌసల్య, జిల్లా విద్యాధికారిగా ఇందు, డీఈఓగా అక్షిత, హెచ్‌ఎంగా పూజ, ప్రవీన్‌కుమార్, 10 విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్‌ఎం ఉమాబాయ్, ఉపాధ్యాయులు గోవిందమ్మ, లత, అశ్వంత్, కృష్ణ, నిఖిల్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించొద్దు



అమ్రాబాద్: ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించొద్దని ఎవరైన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మోతీలాల్ హెచ్చరించారు. సోమవారం ఎన్నికల కోడ్ పత్రాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం గోడకు అతికించారు. రాజకీయపరమైన సమావేశాలు, ఫ్లెక్సీలు, కొత్త పనుల ప్రారంభోత్సవాలు చేయొద్దని పేర్కొన్నారు.

వెల్దండ: ఉమ్మడి మమహబూబ్‌నగర్ జిల్లాలో ఎమ్మెల్సీకి ఉప ఎన్నికకు నోటిఫికేషన్ రావడంతో మండలంలో ఎన్నికల కోడ్ అమలవుతున్నట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో కొత్త పనులకు శంకుస్థాపన, ఫ్లెక్సీల ఏర్పాటు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని వివరించారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

పరీక్ష కేంద్రంలో విద్యార్థికి ఫిట్స్

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో సోమవారం తాడూరు మండలం యత్మతాపూర్ గ్రామానికి చెందిన గోవర్దన్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాస్తున్నాడు. అకస్మాత్తుగా విద్యార్థికి ఫిట్స్ రావడంతో ఇన్విజిలేటర్లు గుర్తించి వెంటనే 108 ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వాహనంలో జనరల్ ఆస్పత్రికి తరలించి చికత్స అనంతరం విద్యార్థి పరీక్షకు హాజరయ్యారు.

ఎమ్మెల్యే బాలు నాయక్‌కు సన్మానం



మన్ననూర్: అచ్చంపేట–మన్ననూర్ ప్రధాన రహదారిలోని నిరంజన్‌షావలి దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. ముజావర్ సమక్షంలో పార్టీ నాయకులతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నాయకుల వెంకటరమణ, సత్యనారాయణ, రాములు, శ్రీశైలం, సుబ్బదాస్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి విద్యార్థులకు గాయాలు

కోడేరు: బైక్ అదుపు తప్పి ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పెద్దకొత్తపల్లికి చెందిన శివశంకర్, ఓబులేషు కోడేరులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాసి బైక్‌పై వెళ్తున్నారు. మండల కేంద్రం సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరి విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ తరలించారు.

నైపుణ్యంతోనే ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న హెచ్‌బీఐ ఆర్‌శెట్టి శ్రీనివాసులు

తెలకపల్లి: నైపుణ్యంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రేనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఎస్బీఐ ఆర్‌శెట్టి డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో ఎస్బీఐ ఆర్‌శెట్టి ద్వారా నిర్వహిస్తున్న మగ్గం, ఎంబ్రాయిడింగ్ శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ కాలం పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మగ్గం వర్క్‌కు ప్రస్తుతం డిమాండ్ ఉందన్నారు. బ్యాంకుల రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఎం నిరంజన్, ఏపీఓ మల్లేష్, చంద్రశేఖర్, ఫరీదా, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు పెంచాలి



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి సమ్మెకు దిగుతామని వివరించారు. జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని ఆస్పత్రి కార్మికుల వేతనాల విషయంలో అవినీతి జరిగిందని ప్రస్తుత ఎస్‌ఎస్‌సీ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, జిల్లా నాయకులు శ్రీనివాస్, అజ్మీర, మణెమ్మ, రేణుక, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేశారు.. క్యూరింగ్ మరిచారు



మండల కేంద్రంలో సీసీ రోడ్డు ఇలా..

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. క్యూరింగ్ చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రూ.లక్షలు నిధుల వెచ్చించి నిర్మించిన సీసీ రోడ్లు దెబ్బతినే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ప్రతి రోజు రోడ్లపై నీటిని పట్టే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ నుంచి డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

కోడేరు: మండలంలోని నాగులపల్లి నుంచి పెద్దకొత్తపల్లి వరకు నిర్మిస్తున్న డబుల్ రోడ్డు కోడేరు గ్రామ పంచాయతీ నుంచి చేపట్టాలని గ్రామస్తులు అధికారులను సోమవారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామ శివారు నుంచి రోడ్డు వేస్తే ప్రజలు, ప్రయాణికులకు ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. అందరికి అందుబాటులో ఉండే విధంగా రోడ్డు నిర్మించాలని వివరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని గ్రామ పంచాయతీ నుంచి రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌కు సన్మానం



ఒబేదుల్లా కొత్వాల్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికై న ఒబేదుల్లా కొత్వాల్‌ను సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్ ఆధ్వర్యంలో పలువురు మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాన్‌గల్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఒబేదుల్లా మజహార్, కర్ణాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమృతమ్మ

ఉప్పునుంతల: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే సమాజం పురోగాభివృద్ధి సాధిస్తుందని ఐకేపీ ఏపీఎం సైదులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అమృతమ్మ, బీపాషా అన్నారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్స్ హబ్ జెండర్ స్పెషలిస్టు సునీత, ఏఈఓ మంజుల, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది జయమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని రామాలయం ప్రాంగణంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. లింగాల, బల్మూర్ మండలాల చెంచు మహిళలు, పురుషులకు మహిళా దినోత్సవం ప్రాముఖ్యతపై ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రాధ అవగాహన కల్పించారు. పిల్లలను బాగా చదివించాలని చెంచులకు సూచించారు. మహిళలకు నిర్వహించిన బెలూన్ ఆట అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆర్డీటీ వైద్యాధికారి సైపుల్లా, న్యాయవాది రవికుమార్, ఏఆర్‌ఐ తిర్పతమ్మ, ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్రాబాద్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సీడీపీఓ దమయంతి అన్నారు. జాతీమ మహిళా దినోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కుమ్మరోనిపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మట్లాడారు. లింగవివక్షతలేని సమాజం కోసం అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు దీవెన, యాదమ్మ తదితరులు ఉన్నారు.



కుమ్మరోనిపల్లిలో